

యోగా... వారసత్వ సంపద

ధ్యానం చేస్తున్న మంత్రి టీజీ భరత్



- దైనందిన జీవితంలో ఆసనాలు తప్పనిసరి
- పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో యోగాంధ్ర వేడుకలు



కర్నూలు అవుట్ డోర్ స్టేడియంలో యోగాలో పాల్గొన్న ప్రజలు

కర్నూలు స్పోర్ట్స్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వేల సంవత్సరాల నుంచి వస్తున్న యోగా మన వారసత్వ సంపద అని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నగరంలోని అవుట్‌డోర్ స్టేడియంలో మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు, విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు, మహిళలు, అధికారుల భాగస్వామ్యంతో 5 వేల మందితో నిర్వహించిన థీమాటిక్ యోగా ప్రదర్శన నిర్వహించారు. యోగా శిక్షకులు మునిస్వామి యోగాసనాలు వేయించారు. యోగా కార్యక్రమం నిర్వహణ తర్వాత మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ యోగా కార్యక్రమంలో పాల్గొనేందుకు దాదాపు 11లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకుని కర్నూలు జిల్లా మొదటి స్థానంలో నిలిచిందని అభినందించారు. యోగా 5వేల సంవత్సరాల నుంచి మనకు వారసత్వంగా వస్తోందని, యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

మిగతా 6 లో...

పాఠాలు చెప్పిన పాలనాధికారి..!



ఉపాధ్యాయురాలిగా పాఠాలు బోధిస్తున్న కలెక్టరు రాజకుమారి

పాణ్యం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిపాలన విధుల్లో నిత్యం బిజీగా ఉండే కలెక్టర్ రాజకుమారి... కాసేపు పిల్లలకు పాఠాలు బోధిస్తూ టీచర్‌గా మారారు. ఈ అరుదైన ఘటన పాణ్యం మండలంలో చోటు చేసుకుంది. జిల్లా పాలనాధికారి తమకు పాఠాలు చెప్పడంపై విద్యార్థులు సైతం ఆనందం వ్యక్తం చేశారు. వివరాల్లోకెళితే... పాణ్యం మండలంలోని సుగాలిమెట్ట సమీపంలోని మోడల్ పాఠశాలను కలెక్టర్ రాజకుమారి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో మాట్లాడి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. తాగునీరు, అప్రోచ్ రోడ్డు సమస్య ప్రధానంగా ఉందని ప్రిన్సిపాల్ కలెక్టరుకు తెలిపారు. విద్యార్థుల హాజరు, విద్యార్థుల సంఖ్యావివరాలు తెలుసుకున్నారు. ప్రయోగశాలలో పరికరాలపై ఆరా తీశారు. పాఠశాల చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సీసీ రోడ్డు, తాగునీటి వసతి కల్పిస్తామన్నారు. అనంతరం పదో తరగతిగదిని పరిశీలించి విద్యార్థినులకు ఆంగ్ల పాఠాలు బోధించారు. పోటీపరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. అంతేకాకుండా చిన్నారులకు కలెక్టర్ స్వయంగా భోజనం తినిపించారు. కలెక్టర్ వెంట ఎంఈవో కోటయ్య, ప్రిన్సిపాల్ దినేష్‌బాబు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

మెగా డీఎస్సీకి 69 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీ మెగా డీఎస్సీ పరీక్షల్లో భాగంగా మంగళవారం రెండు సెషన్స్‌లో నిర్వహించిన పరీక్షలకు 69 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఐదు పరీక్ష కేంద్రాల్లో మొదటి సెషన్‌లో నిర్వహించిన పీజీటీ(జువాలజీ), ఎస్‌జీటీ పరీక్షలకు మొత్తం 895 మంది అభ్యర్థులకు గాను 870 మంది అభ్యర్థులు హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారు. రెండో సెషన్‌లో నిర్వహించిన ఎస్‌ఏ-సోషల్ పరీక్షకు 895 మందికి గానూ 851 మంది హాజరు కాగా 44 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని డీఈవో జనార్దన్‌రెడ్డి తెలిపారు.

కేఎంసీలో వైద్యుల బదిలీ

కర్నూలు హాస్పిటల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ లో వైద్యుల బదిలీ కౌన్సెలింగ్ ముగిసింది. ఆరుగురు ప్రొఫెసర్లు, ముగ్గురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 10 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లను బదిలీ చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ తెలిపారు. ప్రొఫెసర్లలో శ్రీలక్ష్మి (గైనిక్ హెచ్‌వోడీ) అనంతపురానికి బదిలీ కాగా రాధారాణి (రేడియాలజీ) తిరుపతికి, వీరకుమార్ (ఈఎన్‌టీ) రాజమండ్రికి, పి.వెంకటరమణ బాబు (పెథాలజీ) నంద్యాలకు బదిలీ అయ్యారు. అసోసియేట్ ప్రొఫెసర్లలో ఎం.మల్లికార్జున (పీడీయాట్రిక్) కడపకు, టి.ప్రశాంతి (అనాటమి) కాకినాడకు, మాధవీలత (పీజాయాలజీ) అనంతపురానికి బదిలీ అయ్యారు. అదేవిధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లలో అనంతపురానికి డాక్టర్ మీనుగ శ్రీనివాసులు (మెడిసిన్) బదిలీ అయ్యారు. పి.స్నేహ (ఓబీజీ), పి.మమత (ఓబీజీ) తిరుపతికి బదిలీ కాగా... మన్సూర్ బాషా (సర్జరీ) మంజుల (అనస్తీషియా) అపర్ణ (అనాటమి) నంద్యాలకు బదిలీ అయ్యారు. ఆప్తమాలజీ వైద్యులు అనురాధ, లత, బి.విద్యాసాగర్, జాన్సన్‌రాజు కుమార్ తిరుపతికి బదిలీ అయ్యారు.

డీసీఎంఎస్ కేంద్రాలకు పూర్వ వైభవం

- కేంద్రాలకు పుష్కలంగా ఎరువులు
- మొదటి విడత 500 మెట్రిక్ టన్నులు



డీసీఎంఎస్ కార్యాలయం

కర్నూలు అగ్రికల్చర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం హయాంలో జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థ పూర్తిగా నిర్వీర్యమైపోయింది. రైతులకు అవసరమైన ఎరువులను డీసీఎంఎస్ కేంద్రాలకు అందించలేదు. మార్క్‌ఫెడ్ సంస్థ నుంచి అందాల్సిన రూ.3 కోట్ల బకాయిలు అందకుండా చేసింది. ఫలితంగా ఐదు నెలలు ఉమ్మడి జిల్లాలోని 17 డీసీఎంఎస్ కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది జీతాల్లేక పస్తులతో అలమటించారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థకు పూర్వ వైభవం చేకూరింది. మార్క్‌ఫెడ్ నుంచి బకాయిలు విడుదల కావడంతో ఐదు నెలల జీతాలను ఒకేసారి అందించడంతో ఆ సంస్థ కేంద్రాల్లో పని చేస్తున్న సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. మరో వైపు డీసీఎంఎస్ కేంద్రాలకు ప్రస్తుత ఖరీఫ్‌లో సరిపడ ఎరువులు అందించాలని మార్క్‌ఫెడ్ సంస్థకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మొదటి విడతగా ఉమ్మడి జిల్లాలోని 17 డీసీఎంఎస్ కేంద్రాలకు 500 మెట్రిక్ టన్నుల ఎరువులను సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు పంపామని డీసీఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో రైతులకు డీలర్లు ఎంఆర్‌పీ ధర కంటే ఎక్కువ ధర డిమాండ్ చేస్తుండటం వల్ల తీవ్ర ఇబ్బందులకు వారు గురవుతున్నారని ఆయన తెలిపారు. అదే డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ఎరువులను రైతులు కొనుగోలు చేస్తే ఎంఆర్‌పీ ధరకే ఎరువులను వారికి అందించే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ దృష్టితోనే మార్క్‌ఫెడ్ సంస్థకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని, ఖరీఫ్ లో రైతులు ఎటువంటి ఇబ్బందులకు గురి కాకుండా ఎంఆర్‌పీ ధరకే డీసీఎంఎస్ కేంద్రాల ద్వారా ఎరువులు అందిస్తామని చైర్మన్ స్పష్టం చేశారు.

డీసీఎంఎస్‌ను బలోపేతం చేస్తాం



గత వైసీపీ ప్రభుత్వం జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థను నిర్వీర్యం చేసింది. అవసరమైన ఎరువులను తమ సంస్థ కేంద్రాలకు అందించకుండా సతాయించింది. దీని వల్ల రైతులు బహిరంగ మార్కెట్‌లో రైతుల నుంచి ఎంఆర్‌పీ ధర కంటే అధిక ధరను చెల్లించి కొనుగోలు చేయాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఎరువులే కాకుండా వివిధ పంట ఉత్పత్తుల సేకరణకు అవకాశం కల్పించింది.

- వై. నాగేశ్వరరావు యాదవ్, చైర్మన్

అన్ని ఎరువులు అందుబాటులో

ప్రస్తుతం డీసీఎంఎస్ సంస్థ కేంద్రాల్లో ఎరువుల బస్తాలతో కళకళలాడుతున్నాయి. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను మార్క్‌ఫెడ్ సంస్థ ఈ కేంద్రాలకు సప్లయ్ చేస్తుంది. ఎరువుల విక్రయం వల్ల తమకు ఒక బస్తాపై కమిషన్ ప్రభుత్వ నిబంధనల మేరకు అందుతుందని, ఈ కమిషన్ ద్వారా వచ్చే ఆదాయం వల్ల సిబ్బందికి జీతాలు అందించడంతో పాటు డీసీఎంఎస్ సంస్థ బలోపేతానికి చర్యలు తీసుకునేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

రాఘవేంద్రుని సన్నిధిలో జైళ్ల శాఖ డీజీ అంజనీ కుమార్

మంత్రాలయం, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం జైళ్ల శాఖ డైరెక్టర్ ఆఫ్ జనరల్ అంజనీ కుమార్ మంగళవారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈయనకు మహాముఖ ద్వారం వద్ద మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సురేష్ కోణాపూర్, మంత్రాలయం సీఐ రామాంజులు, కర్నూలు జిల్లా జైళ్ల సూపరింటెండెంట్ నరసింహారెడ్డి, ఆదోని జైలర్ నజీర్ అహ్మద్, అనంతస్వామి, పవన్ ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్ పాల్గొన్నారు.



మఠంలో రాష్ట్ర జైళ్ల శాఖ డీజీ అంజనీ కుమార్

పత్తి ధర క్వింటా రూ.7,979



విక్రయానికి వచ్చిన పత్తి దిగుబడులు

ఆదోని అగ్రికల్చర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధరలు కొద్ది రోజులుగా స్థిరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,979 పలికింది. సాధారణంగా ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న సమయంలో పత్తి ధరలు రైతులు పెరుగుతాయి. కానీ ధరలు పెరగకపోవడంతో పత్తి రైతులు నిరాశ చెందుతున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం మార్కెట్‌కు 216 క్వింటాళ్లు విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.5,369, గరిష్ఠంగా రూ.7,979, సగటున రూ.7,709 పలికింది.

సన్నబియ్యంతో సంబరాలు
జిల్లాలో 1,382 పాఠశాలలకు 10,960 బ్యాగుల కేటాయింపు
6
సీ బిల్ గుబుల్..

ప్రజలకు భరోసాగా ఉంటాం



- ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా
- జిల్లాలో వారం రోజులుగా కార్డన్ సర్చ్
- 83 బైకులు, 3 ఆటోలు సీజ్

నంద్యాల టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలను కాపాడటంతో పాటు ప్రజలకు భరోసా ఉండటమే పోలీసుల ప్రధాన కర్తవ్యమని ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా వెల్లడించారు. నంద్యాల జిల్లా వ్యాప్తంగా వారం రోజులగా పోలీసులు విస్తృత దాడులు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. శాంతి భద్రలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. శాంతి భద్రతలో భాగంగా పోలీసులు అండగా ఉంటారన్న లక్ష్యంతోనే కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 83 ద్విచక్రవాహనాలు, 3 ఆటోలు, 124 మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా నియంత్రించేందుకు పోలీసులు భరోసా కల్పిస్తారన్నారు. గ్రామాల్లో ప్రజలకు సమావేశం నిర్వహించి సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల గురించి శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. అత్యవసర సమయాల్లో 1098, 1930, 100, 112 నెంబర్లకు ఫోన్ చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. గతంలో నేరాలకు పాల్పడిన వారిపై, నేరాలు చేస్తారనే వారిపై నిఘా ఉంచామన్నారు. ఎక్కడైనా నేరం జరుగుతుందనే సమాచారం మేరకు పోలీసులు ముందుగానే వారిని నివారించి నేరాలను అరికడుతున్నామన్నారు. గతంలో నేరాలు పాల్పడినవారిపై, రౌడీ షీటర్ల ఇళ్లపై వారి బంధువులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. రౌడీ షీటర్లు తరచూ నేరాలకు పాల్పడితే వారిని జిల్లా నుంచి బహిష్కరిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు.




వాహనాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు



గ్రామంలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

విస్తృతంగా దాడులు : ఆళ్లగడ్డ, ఆత్మకూరు, డోన్, నంద్యాల సబ్ డివిజన్‌ల్లో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. నిత్యం అనుమానితులపై నిఘా ఉంచి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ నేరాల నియంత్రణలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. శాంతి భద్రతలను విఘాతం కల్గించే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. దీంతో ఎస్పీ ఆదేశాల మేరకు అనుమానం ఉన్నవారిపై సిస్టం చెక్ డివైజ్‌తో పరిశీలించి వారిపై ఎలాంటి నేరాలు ఉన్నాయని తెలుసుకుని వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. నేరాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.



యోగా... వారసత్వ సంపద


యోగా విన్యాసాలు




అవుట్‌డోర్ స్టేడియంలో...

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులు యోగా చేయడం అలవర్చుకోవాలని మంత్రి టీజీ భరత్ పిలుపునిచ్చారు. ప్రజలకు యోగా పట్ల అవగాహన కల్పించి ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతో మే 21 నుంచి జూన్ 21 వరకు నెల రోజుల పాటు యోగా కార్యక్రమాలు నిర్వహించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం సముద్రతీరంలో ఐదు లక్షల మందితో జరిగే యోగా కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొంటారన్నారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియం అభివృద్ధికి, అవసరమైన చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. అందులో భాగంగా వాకింగ్ ట్రాక్ తదితర సదుపాయాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రీన్‌కో ద్వారా సీఎస్ఆర్ నిధులు రూ.4 కోట్లతో టిడ్కో గృహ సముదాయాల దగ్గర అంతర్జాతీయ స్థాయిలో క్రికెట్





స్టేడియం నిర్మించే చర్యలు తీసుకుంటున్నామనీ తెలిపారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ జూన్ 21న జరిగే అంర్జాతీయ యోగా కార్యక్రమం కూడా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ రంజిత్ బాషా మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో 11 లక్షల మంది కర్నూలు జిల్లా నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, ఎన్‌సీసీ కల్నల్ ప్రసాద్, డీఎస్‌డీవో భూపతిరావు, కార్పొరేటర్ పరమేష్, ఆయూష్ డాక్టర్ ప్రసాద్, మునిస్వామి, జిల్లా యోగా సంఘం కార్యదర్శి అవినాష్ శెట్టి, అధికారులు, కార్మికులు, విద్యార్థులు పాల్గొన్నారు.









21 నుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలోని కోర్సుల్లో ప్రవేశాల కోసం పాలిసెట్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 21 నుంచి జూన్ 28వ తేదీ వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు కర్నూలు ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్ మంగళవారం తెలిపారు. ఈ కౌన్సెలింగ్ తాండ్రపాడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ సెంటరులో ఉంటుందని తెలిపారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 20 నుంచి 27వ తేదీలోపల వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి ప్రింట్ రసీదును పొందాలన్నారు. ఈ నెల 25 నుంచి జూన్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో ర్యాంకుల వారిగా ఆప్షన్ల నమోదు చేసు కోవాలన్నారు. జూలై 1న ఆప్షన్‌లో మార్పులు చేర్పులు చేసుకోవచ్చని, 3వ తేదీన అలాట్‌మెంట్ ప్రకటిస్తారని తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళా శాలలో సీట్లు పొందిన అభ్యర్థులు రూ.4,700, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశా లలో చేరే అభ్యర్థులు రూ.25వేలు ట్యూషన్ ఫీజు చెల్లించాలన్నారు. పూర్తి వివరాలకు, సందేహాలకు మీ సమీపంలోని హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదిం చాలన్నారు. మరిన్ని వివరాలకు 9885940055ను సంప్రదించాలన్నారు. పీడ బ్ల్యూడీ, క్యాప్, ఎన్‌సీసీన, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వంటి స్పెషల్ కేటగిరీ అభ్య ర్థులు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. ఈ నెల 21 నుంచి 1 నుంచి 15వేల ర్యాంకు, 22న 15001 నుంచి 32వేల ర్యాంకు, 23వ తేదీన 320001 ర్యాంకు నుంచి 50వేల ర్యాంకు, 24న 50001 ర్యాంకు నుంచి 68వేల ర్యాంకు, 25న 68,001 ర్యాంకు నుంచి 86వేల ర్యాంకు వరకు, 26న 86001 నుంచి 10,4000వ ర్యాంకు వరకు, 27న 10,4001 ర్యాంకు నుంచి 12,00,000ల ర్యాంకు వరకు, 28న 12,0001 ర్యాంకు చివరి ర్యాంకు అభ్యర్థులకు కౌన్సెలింగ్ జరుగుతుందని తెలిపారు.

మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దండి

నంద్యాల నూనెపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చదిద్ది వారి ఆర్థిక స్వాలంబనకు తోడ్పాటు అందించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లు, మెప్మా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించాలని సూచించారు. నంద్యాల మున్సిపాల్టీలో 111, ఆళ్లగడ్డలో 24, ఆత్మకూర్‌లో 19, బేతంచెర్లలో 17, డోన్‌లో 26, నందికొట్కూర్‌లో 24 యూనిట్లను స్థాపించి మహిళల జీవనోపాధికి తోడ్పడాలని సూచించారు.

రేపు అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

కర్నూలు న్యూసిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి):ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగే సౌత్ జోన్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక 19న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవేందర్‌గౌడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు డీఎస్ఏ స్టేడియంలోని కర్నూలు క్రికెట్ అసోసియేషన్ నెట్స్‌లో ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు పాల్గొనాలని ఆయన కోరారు. 1-9-2009 తరువాత 31.8.2011కు ముందు జన్మించిన వారు అండర్ 16 జట్టు ఎంపికకు అర్హులన్నారు. జనన ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో ఎంపికకు రావాలన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యా సంవత్సరానికి గాను ఓపెన్ స్కూల్‌కు పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ తెలిపారు. అడ్మిషన్లు జూన్ 12వ తేదీ మొదలవుతాయని, ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు సమర్పించడానికి జూలై 30వ తేదీ చివరి గడువు అని తెలిపారు. అడ్మిషన్ల ఫీజు చెల్లించడానికి ఆఖరి గడువు జూలై 31వ తేదీ అన్నారు. ఆలస్య రుసుము రూ.200లతో అడ్మిషన్లు ఆన్‌లైన్ చేయడానికి ఆగస్టు 15వ తేదీ చివరి గడువు అన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం సంబంధిత వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు.

సన్నబియ్యంతో సంబరాలు


పాణ్యం ఏపీ మోడల్‌స్కూల్‌లో విద్యార్థినికి భోజనం తినిపిస్తున్న కలెక్టర్ రాజకుమారి గణియా

- జిల్లాలో 1,382 పాఠశాలలకు 10,960 బ్యాగుల కేటాయింపు
- ఇంటి భోజనంలా ఉందంటున్న విద్యార్థులు
- ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న అడ్మిషన్లు

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మెరుగైన నూతన విద్యావిధానంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యతతో కూడిన సన్నబియ్యం చేర్చడంతో విద్యార్థులు పాఠశాలల వైపు పరుగులు తీస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో సాధారణ రకం బియ్యాన్ని పాఠశాలలకు సరఫరా చేయడంతో తినలేక విద్యార్థులు ముఖం చాటేసేవారు. ప్రస్తుతం 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం' పథకంతో సన్నబియ్యంతో వండిన అన్నం, ఆకుకూరపప్పు, బెల్లంపొంగలి, గుడ్డు, రాగిజావ, చిక్కీలతో పిల్లలకు మంచి రుచికరమైన పౌష్టికాహారం అందుతోంది. బడులు ప్రారంభించిన మొదటి రోజు నుంచే పిల్లలకు పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకుంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు సిద్ధం చేస్తున్నారు. ఒక్కసారిగా అడ్మిషన్లు వెల్లువలా వస్తున్నాయి. నంద్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 6వతరగతిలో ప్రవేశానికి రెండు రోజుల్లోనే 75 అడ్మిషన్‌లు వచ్చాయి. దీంతో ఏ విధంగా ప్రభుత్వ పాఠశాలల వైపు మొగ్గుతున్నారో ఇట్టే తెలిసిపోతుంది.

జియో ట్యాగింగ్ ద్వారా సరఫరా

నంద్యాల జిల్లాలో 1,382 పాఠశాలలకు జూన్ నెలకు సంబంధించి 10,960(25కేజీలు) బ్యాగులు పౌర సరఫరాల సంస్థ ద్వారా చేరాల్సి ఉండగా నేటి వరకు 7,112 బ్యాగులను సరఫరా చేశారు. పాఠశాలలకు చేరేబియ్యం పక్కదారి పట్టకుండా ఉండేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంది. ప్రతి బ్యాగుకు జియోట్యాగ్‌లను ఏర్పాటుచేసింది. పాఠశాలకు చేరిన ప్రతి బస్తాను స్కాన్ చేసి ఉన్నతాధికారులకు పంపేవిధంగా ఏర్పాటు చేసింది.

ఆహార పట్టిక ఇలా..

సోమవారం	- అన్నం, కూరగాయల కూర, ఉడికించిన గుడ్డు, చిక్కీ
మంగళవారం	- పులగం లేదా పులిహోర, పల్లిచట్నీకోడిగుడ్డు ఫ్రై, రాగిజావ
బుధవారం	- అన్నం, సాంబారు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం	- వెజిటబుల్‌రైస్, గుడ్డుకూర రాగిజావ
శుక్రవారం	- అన్నం, ఆకుకూరపప్పు ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం	- అన్నం, కందిపప్పుచారు బెల్లంపొంగలి, రాగిజావ


భోజనం చేస్తున్న విద్యార్థులు

ఒక్కో విద్యార్థికి 100- 200 గ్రాములు

జిల్లాలోని 989 ప్రైమరీ పాఠశాలల విద్యార్థులకు ఒక్కరోజుకు ఒక్క విద్యార్థికి 100 గ్రాములు కేటాయించగా వారికి ప్రతిరోజు 4,364 కేజీలు అవసరం. 139 ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు 150 గ్రాములు కేటాయించగా వారికి ప్రతిరోజు 5,624 కేజీలు అవసరం. 233 ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి 150 గ్రాములు కేటాయించగా రోజుకు 4,675 కేజీలు అవసరం. 21 జూనియర్ కళాశాలలుండగా ప్రతి విద్యార్థికి 200 గ్రాముల చొప్పున ప్రతిరోజు 1,089 కేజీల సన్నబియ్యం అవసరమవుతాయి.


విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం తింటున్న కలెక్టర్

బియ్యం నాణ్యతగా ఉన్నాయి



16 సంవత్సరాలుగా వంట ఏజన్సీ నిర్వాహకురాలిగా పనిచేస్తున్నాను. గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం వస్తున్న బియ్యం ఎంతో నాణ్యతగా ఉన్నాయి. పిల్లలు ఎంతో ఇష్టంగా తింటున్నారు. మంచి కూరగాయలు, ఆకుకూరలతో పప్పు, చారు, వెజిటబుల్ కర్రీ చేస్తున్నాము. ప్రతి విద్యార్థి కడుపునిండా భోజనం పెడుతున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెబుతున్నాము.

- శశికళ, ప్రభుత్వ బాలికల పాఠశాల వంట ఏజన్సీ నిర్వాహకురాలు

ఇంటి భోజనంలా ఉంది.



నేను నంద్యాల ప్రభుత్వ బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాను. గతంలో లావుబియ్యంతో చేసిన భోజనం తినాలంటే ఇష్టం ఉండేది కాదు. ప్లేటులోనే సగం వదిలేసేవాళ్లము. నేడు ఒక్క మెతుకు కూడా వదలకుండా తింటున్నాము.

- ధనలక్ష్మి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, నంద్యాల

కడుపునిండా తింటున్నాము



నేను 9వ తరగతి చదువుతున్నాను. పాఠశాల తెరిచిన మొదటి రోజు నుంచి మంచి రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారు. ప్రతి ఒక్కరం కడుపునిండా తింటున్నాము. అన్నంతో పాటు గుడ్డు కాకుండా గుడ్డుఫ్రై కూడా చేస్తున్నారు. శనివారం బెల్లంపొంగలి రుచే వేరు. మంచి భోజనం అందిస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఉంటాము.

- పావని, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, నంద్యాల

బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు



బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ట చర్యలు తీసుకున్నాము. జియోట్యాగ్ ద్వారా బియ్యం ప్రతి పాఠశాలకు చేరేవిధంగా మూడు దశల్లో పర్యవేక్షిస్తున్నాము. విద్యార్థులకు మంచి రుచికరమైన ఆహారం వడ్డించాలని ఏజన్సీ నిర్వాహకులకు స్పష్టంగా తెలియజేశాము. ఏ మాత్రం అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటాము.

- శంకర్‌ప్రసాద్, డీవైఈవో, నంద్యాల

సీ బిల్ గుబుల్..



పొదుపు సంఘాల మహిళలు, అవగాహన

- పొదుపు మహిళలకు ఆటోల మంజూరు తప్పనిసరి
- బ్యాంకు రుణాలకు సీ బిల్ స్కోర్ లేక ఇబ్బందులు
- జిల్లాలో 176 మంది మహిళలకు ఆటోలు ఇప్పించాలని లక్ష్యం
- ఒక్కో పొదుపు సంఘానికి రూ.10 లక్షల నుంచి 15 లక్షల వరకు బ్యాంకు లింకేజీ

నంద్యాల టౌన్, జూన్17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో పొదుపు సంఘాల పేరిట ఇతరులు బ్యాంకు నుంచి అప్పులు తీసుకున్నారు. వాళ్లు సకాలంలో తిరిగి చెల్లించలేదు. కొందరు మహిళలు కూడా సరిగా వాయిదాలు చెల్లించలేదు. వెరసి పొదుపు మహిళలు తిరిగి బ్యాంకు లోన్ తీసుకోవడానికి సీ బిల్ స్కోర్ తగినంత లేకపోవడంతో ఇప్పుడు ఇబ్బంది పడుతున్నారు. బ్యాంకుల నుంచి వారికి రావాల్సిన పలు రుణాలు రావడం లేదు.

మహిళా సాధికారిత సాధనలో భాగంగా జీవనోపాధుల యూనిట్లు పెట్టుకోవడానికి ముందుకు వచ్చే మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నంద్యాల జిల్లాలో ఇప్పటికే 176 మందికి ఆటోలు ఇప్పించాలని భావించింది. వాహనాలు మంజూరైనప్పటికీ సీ బిల్ స్కోర్ లేకపోవడంతో రుణాలు జారీ చేయడంలో జాప్యం జరుగుతున్నది. గతంలో రుణాలు సక్రమంగా చెల్లించకపోవడంతో ఈ ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పటికైనా పొదుపు మహిళలు గతంలో తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలని, లేకపోతే ఇలాంటి వారికి రాబోయే రోజుల్లో ఇబ్బందవుతుందని అధికారులు చెబుతున్నారు.

దిద్దుబాటు చర్యలు ఆవశ్యం....



జిల్లాలో మెప్మా ఆధ్వర్యంలో సుమారుగా 4,333 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో ఈ సంఘాల అన్నింటికీ సుమారుగా ఒక్కో సంఘానికి రూ.10 లక్షల నుంచి 15 లక్షల వరకు రుణాలు మంజూరు చేశారు. వీరిలో 30 శాతం సంఘాలు సరిగా లావాదేవీలు సాగించడం లేదని తెలుస్తోంది. మొత్తం సంఘాల్లో 40శాతం సభ్యులకు సీ బిల్ స్కోర్ 700 కంటే తక్కువగా ఉంది. దీంతో అప్రమత్తమైన పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) దీనిపై అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటోంది. రుణ వాయిదాలను సక్రమంగా చెల్లించపోతే సీ బిల్‌పై ప్రభావం పడుతోందని సభ్యులకు వివరిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం.

రుణాలు తీసుకున్న వారందరూ సకాలంలో తిరిగి చెల్లించాలని పొదుపు సంఘాల్లోని వారందరికీ అవగాహన కల్పిస్తున్నాం. రుణాలు చెల్లించే వారు నేరుగా బ్యాంకు తమ గ్రూప్ లీడర్‌తో కలిసి వెళ్లాలని సూచిస్తున్నాం. ఎవరికీ డబ్బులు ఇచ్చి మోసపోవద్దు. దీంతో కూడా సీ బిల్ సమస్యలు వస్తున్నాయి.

● నాగశివలీల, మెప్మా పీడీ, నంద్యాల జిల్లా

18 ఏళ్ల తర్వాత బదిలీ!

● కర్నూలు జీజీహెచ్ ఆఫీస్ సూపరింటెండెంట్ కడపకు బదిలీ

కర్నూలు హాస్పిటల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల పరిపాలన విభాగంలో 18 ఏళ్లుగా వివిధ హోదాల్లో పని చేస్తూ ప్రస్తుతం ఆఫీస్ సూపరింటెండెంట్‌గా ఉన్న ఏ.శ్రీనివాసులు కడపకు బదిలీ అయ్యారు. మంగళవారం జరిగిన బదిలీల కౌన్సెలింగ్‌లో శ్రీనివాసులు కడప ఆర్డీ కార్యాలయానికి బదిలీ కాగా.. అక్కడ పనిచేస్తున్న రమేష్ ఆఫీసు సూపరింటెండెంట్‌గా కర్నూలు జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. హెల్త్ ఎడ్యుకేటర్‌లో రమణ గోస్పాడు నుంచి అహోబిళం, వెంకటమ్మ చాగలమర్రి నుంచి కడపకు బదిలీ అయ్యారు. ఆఫీస్ సూపరింటెండెంట్ సునీత కేఎంసీ నుంచి చిత్తూరుకు బదిలీ అయ్యారు. ఒకే స్థానంలో ఐదేళ్లు పూర్తి చేసుకున్న సాధారణ ఉద్యోగులతో పాటు 9 సంవత్సరాల పాటు పనిచేసిన ఆఫీస్ బేరర్ ఉద్యోగులను కూడా బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకో వడంతో ఏళ్లకు తరబడి పాతుకుపోయిన వారి బదిలీ అనివార్యమైంది.

వైద్యఆరోగ్యశాఖలో 73 మందికి స్థానచలనం

కర్నూలు హాస్పిటల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉద్యోగులకు డీఎంహెచ్‌వో బదిలీలు నిర్వహించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా క్యాడర్‌కు బదిలీలు చేశారు. 47 మంది మహిళా ఆరోగ్య కార్యకర్తలకు, 16 మంది ల్యాబ్ టెక్నీషియన్లకు, ఏడుగురు డ్రైవర్లు, ముగ్గురు మేల్ ఆరోగ్య కార్యకర్తలకు డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, కార్యాలయ ఏవో కె.అరుణ బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

హెడ్ నర్సులు బదిలీలు: గోనెగండ్ల పీహెచ్‌సీ నుంచి హెడ్ నర్సుగా పని చేస్తున్న ఎన్.లక్ష్మీనరసమ్మ కర్నూలు జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. హెడ్ నర్సులు కే.ఉమ, సుబాషిణి అనంతపురం జీజీహెచ్‌కు, కర్నూలు జీజీహెచ్‌కు చెందిన ఆరుగురు హెడ్ నర్సులు తిరుపతికి బదిలీ అయ్యారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సత్వర చర్యలు

- క్రికెట్ స్టేడియం నిర్మిస్తాం
- లక్ష్మీపురం టిడ్కో ఎదురుగా శంకుస్థాపన చేసిన మంత్రి టీజీ భరత్



క్రికెట్ స్టేడియం నిర్మాణ శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

కల్లూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధికి అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ. భరత్ పేర్కొన్నారు. మంగళ వారం కల్లూరు మండలం లక్ష్మీపురం జగన్నాథగట్టు టిడ్కో గృహాల ఎదురుగా 6 ఎకరాల్లో గ్రీన్‌కో కంపెనీ సీఎస్ఆర్ నిధులతో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం, క్రీడా కాంప్లెక్స్‌కు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ హైవేకి దగ్గరలో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయడం గొప్పవిషయమన్నారు. కర్నూలు జిల్లా అభివృద్ధికి చిహ్నంగా ఇది నిలుస్తుందన్నారు. అదే విధంగా కోడుమూరు నియోజకవర్గంలో బాలసాయిబాబా స్కూల్ ప్రక్కన ఉన్న ఏసీఏ క్రికెట్‌గ్రౌండ్‌లో కూడా స్టేడియం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామ న్నారు. గ్రీన్‌కో కంపెనీ పీ-4 విధానం ద్వారా ముందుకు వచ్చి సీఎస్ఆర్ కింద రూ.4 కోట్లతో స్టేడియం నిర్మించడం అభినందించాల్సిన విషయమన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద పంప్‌డ్ హైడ్రో పవర్ ప్రాజెక్టు కర్నూలు జిల్లాలో ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో మరిన్ని మంచి పరిశ్రమలు తీసుకుని వచ్చి ఉపాధి అవకాశాలు కూడా కల్పించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రతి నియోజకవర్గంలో ఎమ్ఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాల కల్పనకు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. పత్తికొండలో ఏర్పాటు చేయనున్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌ను త్వరలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటమని మంత్రి టీజీ. భరత్ తెలిపారు.

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మాట్లాడుతూ గ్రీన్‌కో సహకారంతో లక్ష్మీపురం జగన్నాథగట్టు వద్ద స్టేడియం, క్రీడా ప్రాంగణం తలపెట్టడం గర్వకారణమన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు మాట్లాడుతూ క్రీడాకారులు అవకాశాల కోసం హైదరాబాద్, విజయవాడ. విశాఖపట్టణం ఇక వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు సంకల్పం పీ-4 మోడల్ ఒక ఉదాహరణ అన్నారు. ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మాట్లాడుతూ క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా చర్యలు తీసుకుం టుందన్నారు. కూడా చైర్మన్ సోమిశెట్టి మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రవీంద్రబాబు, గ్రీన్‌కో కంపెనీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్, గ్రీన్ కో అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ నాయుడు, తసీల్దారు కె.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి మార్పు

నందికొట్కూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టిన 24 గంటల్లోనే మరొకరికి బాధ్యతలు ఇస్తూ జేసీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సోమవారం నందికొట్కూరు ఎంఎల్ఎస్ గోదాము ఇన్‌చార్జిగా నారాయణమ్మ రిలీవ్ కావడంతో ఆమె స్థానంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టారు. అయితే మంగళవారం చంద్రశేఖర్ స్థానాన్ని మార్పుచేస్తూ కర్నూలు అర్బన్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ఉన్న గిరికుమార్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. చంద్రశేఖర్‌ను నందికొట్కూరు సీఎస్‌డీటా గానూ, నందికొట్కూరు సీఎస్‌డీటీగా ఉన్న షానావాజ్‌ను మిడ్తూరు డిప్యూటీ తహసీల్దార్‌గా నియమిస్తూ జేసీ విష్ణు చరణ్ ఉత్తర్వులు జారీ చేశారు.

పోక్సో కేసులో 20 ఏళ్లు కారాగారం

- 2022 కేసులో సంచలన తీర్పు


శిక్ష పడిన నిందితుడు తెలుగు గంగాధర్

కర్నూలు లీగల్/వెలుగోడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికపై అత్యాచారం కేసులో కర్నూలు జిల్లా పోక్సో కోర్టు సంచలన తీర్పునిచ్చింది. నిందితుడు గంగాధర్‌కు 20 ఏళ్ల కారాగార శిక్ష, రూ.25వేలు జరిమానా విధిస్తూ న్యాయాధికారి రాజేంద్రబాబు మంగళ వారం తీర్పు చెప్పారు. జిల్లాలోని ఓ గ్రామంలో బాలికను మాయమాటలు చెప్పి గర్భిణిని చేసిన నిందితుడిపై నేరం రుజువు కావడంతో వెలుగోడు పోలీసులు దాఖలు చేసిన చార్జ్‌షీటు మేరకు కోర్టు ఈ తీర్పు ఇచ్చింది. 2022 జూలై 14వ తేదీన జరిగిన ఈ నేరంలో అప్పటి ఆత్మకూరు ఇన్‌చార్జి డీఎస్పీ సి.మహేశ్వరరెడ్డి నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. తర్వాత బాధితురాలికి ఒక మగశిశువు పుట్టి మృతి చెందాడు. ఆ మృత శిశువు రక్తం నమూనాలు సేకరించిన పోలీసులు డీఎన్ఏ టెస్టుకు పంపించారు. ఆ రక్త నమూనాలు నిందితుడి డీఎన్ఏతో సరిపోయాయని పోలీసులు కోర్టుకు నివేదించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.25వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. రూ.25వేలు బాధితురాలికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోర్టు సూచించింది. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీవీ శ్రీనివాసులు వాదించారు.

రోడ్డు ప్రమాదంలో బైక్ రైడర్ మృతి

ప్యాపిలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బైక రైడర్ మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది. ఎస్ఐ మధుసూదన్ తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రంలోని సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌కు చెందిన ఆదిత్య సుబ్రహ్మణ్యం(44)తో పాటు స్నేహితులు 11 మంది కలిసి బైకులపై పది రోజుల క్రితం ఊటీకి వెళ్లారు. అక్కడ రెండు రోజులు ఆనందంగా గడిపారు. తిరిగి సొంత రాష్ట్రానికి బైకులపై బయలుదేరారు. మార్గమధ్యంలోని ప్యాపిలి సమీపంలోకి రాగానే సుబ్రమణ్యం బైకు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొంది. తీవ్రంగాయాలు కావడంతో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. స్నేహితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ట్రాక్టర్ కిందపడి రైతు..

తుగ్గలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమీనాబాదులో పొలంలో ట్రాక్టర్‌తో కంది గుంటక వేస్తుండగా ట్రాక్టర్ కిందపడి శ్రీనివాసులు చౌదరి(51) అనే రైతు మంగళ వారం మృతి చెందాడు. వివరాల మేరకు.. ట్రాక్టరుతో పని చేస్తుండగ ట్రాక్టరు చక్రం పొలంలోని రాయిని ఎక్కడంతో అదుపు తప్పింది. డ్రైవింగ్ చేస్తున్న శ్రీనివాస చౌదరి ట్రాక్టరుకింద పడి తీవ్రగాయాలకు గురయ్యాడు. చుట్టుపక్కలే ఎవరూ లేరు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ తన వద్ద ఉన్న సెల్ ద్వారా భార్యకు తెలిపాడు. హుటాహుటిన బంధువులు, గ్రామస్థులు పొలానికి వెళ్లి శ్రీనివాసచౌదరిని గుత్తి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుత్తి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీనివాసులు చౌదరి (ఫైల్)

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

గోనెగండ్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మద్యం తాగేందుకు తనకు భార్య డబ్బులు ఇవ్వకపోవడంతో ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ విజయభాస్కర్ తెలిపిన మేరకు.. గోనెగండ్లకు చెందిన బాలముని మద్యానికి బానిసయ్యాడు. సోమవారం రాత్రి భార్య నరసమ్మను డబ్బులు అడిగాడు. లేవని చెప్పడంతో ఊగిపోతూ గ్రామ శివార్లలోని పొలానికి వెళ్లి పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున బాలముని మృతిచెందాడు. భార్య నరసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యపై కత్తితో దాడి

- తల్లికి వందనం డబ్బులు ఇవ్వలేదని...
- కేసు నమోదు చేసిన పోలీసులు

నంద్యాల/ఉయ్యాల వాడ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం కింద వచ్చిన డబ్బులు ఇవ్వలేదని భార్యపై కత్తితో దాడిచేసిన ఘటన నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం కొండుపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన వెంకటనరసింహుడు, సుమిత్ర దంపతులకు ఇద్దరు పిల్లలు. ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద రూ. 21వేలు సుమిత్ర ఖాతాలో జమ చేసింది. తాగుడుకు బానిసైన భర్త వెంకటనరసింహుడు ఆ డబ్బులు తనకు ఇవ్వాలని భార్యపై ఒత్తిడి తీసుకువచ్చాడు. దానికి ఆమె నిరాకరించింది. దీంతో వెంకట నరసింహుడు ఆమెను కత్తితో దాడి చేశాడు. బలమైన గాయం కావడంతో స్థానికులు ఆళ్లగడ్డ ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. దీనిపై సుమిత్ర పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఉయ్యాలవాడ పోలీసులు కేసు నమోదు చేశారు.

సీవో, ఆర్పీ మధ్య గొడవ

- రూ.30 వేల విషయంలో ఘర్షణ
- విచారించి మెమోలు జారీ చేసిన పీడీ


విచారణ చేస్తున్న మెప్మా అధికారులు

నంద్యాల టౌన్, జూన్17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మంగళవారం ఇద్దరి మహిళల మధ్య గొడవ జరిగింది. ఒక సీవో, ఒక ఆర్పీ మధ్య రూ.30 వేలు డబ్బులు విషయంలో ఇద్దరి మధ్య ఉదయం నుంచి గొడవ జరుగుతున్నట్లు సమాచారం. అయితే గొడవ పెరిగి పెద్దదై సాయంత్రానికి చెప్పులతో కొట్టుకున్నట్లు సమాచారం. రుణాలు మంజూరు ప్రతి సారి లంచాలు ఇవ్వాల్సిందేనా.? అన్నట్లు వారితో గొడవ పడ్డారు. దీంతో రంగంలో కర్నూలు నుంచి ఆకస్మాత్తుగా పీడీ నాగశివలీలా ప్రత్యక్షమై ఏమీ జరగనట్లు వ్యవహరించారు. అప్పటికే సమాచారం తెలియడంతో చేసేదేమీ లేక మెమోలు జారీ చేసి వారి నుంచి వివరణ వచ్చిన తర్వాత చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా నుంచి అధికారులు ఇద్దరితో విచారణ చేపట్టారు.

సిమెంటు ఫ్యాక్టరీకి రాజకీయ గ్రహణం

- కార్మికుల కష్టాలను పట్టించుకోని యాజమాన్యం
- రాజకీయాలకతీతంగా ఫ్యాక్టరీని నడిపించాలని కార్మికుల విజ్ఞప్తి



మూతపడిన సిమెంటు ఫ్యాక్టరీ .. ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని కార్మికుల దీక్షలు

బేతంచెర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాణ్యం నియోజకవర్గంలోని బేతంచెర్ల మండల సిమెంటునగర్ గ్రామంలో ఉన్న పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీకి రాజకీయ గ్రహణం పట్టుకుంది. ఈ ఫ్యాక్టరీపై రాజకీయ ఆధిపత్యం కొనసాగించేందుకు పాణ్యం రాజకీయ నాయకులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ప్రత్యర్థులు బిజ్జం సత్యంరెడ్డి మధ్య జరిగిన పోరులో కార్మికులు నలిగి పోయారు. సిమెంట్‌నగర్ కార్మిక నాయకుడు సూర్యానారాయణ 1987లో హత్యకు గురయ్యాడు. అప్పటి నుంచి పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీ కార్మికుల పరిస్థితి అధ్వానంగా కొనసాగుతుంది. అనంతరం నంద్యాల నంది పైపుల యాజమాన్యం సిమెంటు ఫ్యాక్టరీ నిర్వహణ చేపట్టింది. కార్మికులకు జీతభత్యాలు ఇచ్చి ఫ్యాక్టరీ నిర్వహించింది. కర్నాటక బెంగుళూరు ప్రాంతాల్లో ఉన్న పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీకి చెందిన ఆస్తులన్నీ విక్రయించడంతో ఫ్యాక్టరీ అధోగతి పాలైంది. అప్పటి నుంచి కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఎస్వీవై రెడ్డి అల్లుడు శ్రీధర్ రెడ్డి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్న కాలంలో ఫ్యాక్టరీని మూసివేశారు. కార్మికుల కుటుంబాల పోషణ కూడా భారమైంది. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వంలో ప్రస్తుతం ఉన్న సాగర్ సిమెంటు యాజ మాన్యం ఫ్యాక్టరీ నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. ఈ యాజమాన్యం రిటైర్డు డీఎస్పీ నరసింహారెడ్డి, సిమెంటు నగర్ సర్పంచ్ మరియమ్మ కుమారుడు యాకోబు ఫ్యాక్టరీలో విధులు నిర్వహించే 13 మంది కార్మికులను పనుల్లోకి రాకుండా చేశారు. వైసీపీ కండువా వేసుకున్న వారిని విధుల్లోకి చేర్చుకున్నారు. టీడీపీకి చెందిన వారిని విధుల్లోకి తీసుకోకపోవడంతో వారు ఎన్‌సీఎల్టీ కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఈ 13 మంది కార్మికులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయినా యాజమాన్యం ఒప్పుకోక పోవడంతో వారు ఫ్యాక్టరీ బైటే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ విషయంపై లేబర్ కోర్టును కూడా ఆశ్రయించామని, అక్కడా తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని కార్మికులు తెలిపారు. అంతలోనే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అంత వరకు ఉన్న యాజమాన్యం ఫ్యాక్టరీని మూసివేసింది. అయినా వైసీపీకి చెందిన కార్మికులకు మాత్రం నెలకు రూ. కోటి దాక జీతాలు కింద చెల్లిస్తుందని, మరో రూ.2కోట్లు పెట్టుకుంటే ఫ్యాక్టరీ నడుస్తుందని పలువురు కార్మికులు ఆరోపించారు. ఫ్యాక్టరీలో ఉన్న స్క్రాప్ అంతా అమ్మడంతో బుగ్గనకు రూ.300 కోట్లు, యాజమాన్యానికి రూ.300 కోట్లు ఆదాయం వచ్చిందని, ఆ తర్వాత ఫ్యాక్టరీ మూసివేశారని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా రాజకీయ పార్టీలతో సిమెంట్ ఫ్యాక్టరీ తాము చాలా ఇబ్బందులు పడుతున్నామని కార్మికులు దీక్షలు చేపట్టారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాణ్యం సిమెంటు ఫ్యాక్టరీని రాజకీయ పార్టీల జోక్యం లేకుండా సజావుగా నడిపించేందుకు చర్యలు తీసుకోవాలని కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇద్దరు విద్యార్థులు.. ఒక ఉపాధ్యాయుడు!


పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు సుబ్బయ్య

చాగలమర్రి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి ఎస్సీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నారు. ఈ ఏడాది 1వ తరగతిలో కొత్తగా ఇద్దరు విద్యార్థులు మాత్రమే చేరారు. ఆ విద్యార్థులకు ఉపాధ్యాయుడు పాఠాలు బోధిస్తున్నారు. గత ఏడాది 1 నుంచి 5వ తరగతి వరకు నలుగురు విద్యార్థులు మాత్ర మే ఉన్నారు. 2వ తరగతిలో ఇద్దరు, 3వ తరగతిలో ఇద్దరు విద్యార్థులు మాత్ర మే ఉన్నారు. పెద్దవంగలి గ్రామంలోని మెయిన్ పాఠశాలను మోడల్ పాఠశాలగా ఏర్పాటు చేయ డంతో ఉన్న నలుగురు విద్యార్థులు ఆ పాఠశాలకు వెళ్లారు. ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో కేవలం 1, 2 తరగతులు మాత్రమే నిర్వహిస్తున్నారు.

కొత్తగా చేరిన ఇద్దరు విద్యార్థులకు మాత్రమే ఉపాధ్యాయుడు పాఠశాలు బోధిస్తున్నారు. వంట ఏజెన్సీ మహిళ ఆ ఇద్దరు విద్యార్థులకే భోజనం తయారు చేసి వడ్డించారు. ఎంఈవో అనూరాధను వివరణ కోరగా విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు.

బియ్యం దొంగలపై పోలీసులకు ఫిర్యాదు

- కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్న వన్‌టౌన్ పోలీసులు


బియ్యం గోడౌన్‌ను సీజ్ చేస్తున్న అధికారులు(ఫైల్)

ఆదోని రూరల్, మార్చి 17 (ఆంధ్రజ్యోతి): ఆదోని - శిరుగుప్ప ప్రధాన రహదారిలోని ఓ గోడౌన్‌లో రేషన్ బియ్యాన్ని ఈనెల 13వ తేదిన సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్ నాయుడు దాడులు చేసి సీజ్ చేసిన విషయం విధితమే. అయితే 1,500 బస్తాల బియ్యాన్ని గుర్తించగా, మరుసటి రోజు 109 బస్తాలే కనిపించాయి. బియ్యం మాయమైన విషయం తెలిసి మంగళవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ రమేష్, డీటీ బాబురావు ఆదే శాల మేరకు వీఆర్వో రాజశేఖర్ గౌడ్ పట్టణ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానం, సెల్‌ఫోన్ టవర్ల సాయంతో బియ్యం దొంగలను గుర్తిస్తామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

అదుపులో బియ్యం దొంగలు

- ఆలూరులో 34 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం
- వాహనం సీజ్, ఇరువురిపై కేసు నమోదు


గోదాంలో భద్రపరుస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు


ఈ వాహనంలోనే బియ్యాన్ని తరలించారు

ఆలూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడిగుడ్డం సమీపంలో సోమవారం అర్ధరాత్రి 34 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు ఎస్ఐ మహబూబ్ బాషా తెలిపారు.

వివరాల మేరకు.. ఏపీ39 డబ్ల్యూటీ 3291 నంబర్ గల బొలెరో వాహనంలో రేషన్ బియ్యాన్ని ఆదోని వైపు తరలి స్తుండగా స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రామకృష్ణ, లింగన్న ఆధ్వర్యంలో వాహనాన్ని సీజ్‌చేసి బియ్యాన్ని ఆలూరు సివిల్ సప్లై గోదాంకు ఏఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తరలించారు. ఆదోనికి చెందిన ఇందప్ప, షేక్షావలిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ రవిశంకర్‌రెడ్డి మంగళవారం రాత్రి విలేకరులకు తెలిపారు.

యువకుడి అదృశ్యం


కె.శివ (ఫైల్)

కర్నూలు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వే స్టేషన్‌లో గద్వాల జిల్లా కుర్వపల్లి గ్రామానికి చెందిన కె. శివ (20) అనే యువకుడు అదృశ్యమయ్యారు. శివకు మతిస్థిమిత లేక పోవడంతో గత శనివారం గద్వాల రైల్వే స్టేషన్‌లో రైలు ఎక్కి కర్నూలు రైల్వే స్టేషన్‌లో దిగారు. బంధువులు కర్నూలు రైల్వే స్టేషన్, కొత్తబస్టాండ్, బళ్లారి చౌరస్తా, నంద్యాలచెక్‌పోస్టు ప్రాంతాల్లో వెతికినా దొరకలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించడంతో సీసీకెమెరాల్లో చూశారు. సీసీకెమెరాల్లో కర్నూలు స్టేషన్‌లో దిగి మూడు గంటల పాటు అటు, ఇటూ తిరిగి మళ్లీ డోన్ వైపు వెళ్లే రైలు ఎక్కాడని తేలింది. డోన్, వెల్దుర్తి, గుంతకల్లు స్టేషన్లలో వెతికినా యువకుడు కనిపించలేదు. కర్నూలు రైల్వే పోలీసులకు యువకుడి ఆచూకీ లభించలేదని మంగళవారం చెప్పడంతో వారు గద్వాలలో ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధితులు గద్వాల పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఈయువకుడి ఆచూకీ తెలిస్తే పోలీసులకైనా, బంధువుల 9652973618, 9573152014లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అనాథ పిల్లలకు ఆధార్ ఇవ్వాలని ఆదేశం


మాట్లాడుతున్న బి.లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అనాథ బాలలకు ఆధార్ కార్డులు ఇవ్వాలని కర్నూలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి మంగళవారం ఆదేశించారు. స్థానిక వెంకట రమణ కాలనీలోని పంప్ హౌస్ ఎదురుగా నిర్వహిం చిన తనిఖీలలో 22 మంది అనాథ బాలలకు గుర్తింపు కార్డులు లేవని అన్నారు. వీరందరికీ సాఫీ కమిటీ వారు వెంటనే ఆధార్ కార్డులు ఇవ్వాలని అన్నారు. ఆ తర్వాత స్థానిక న్యాయ సేవాసదన్ భవన్‌లో సాఫీ కమిటీ వారితో ప్రత్యేక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించి జిల్లాలో అనాథ బాలలను గుర్తించాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ ప్రాజెక్టు డైరెక్టర్ పి. నిర్మల, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద తదితరులు పాల్గొన్నారు.

ఉప లోకాయుక్త జోక్యంతో రైతులకు పరిహారం

కర్నూలు లీగల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని గురు రాఘవేంద్ర ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టాన్ని నీటి పారుదల శాఖ అధికారులు తప్పుగా చూపించడంతో నష్టపోయిన రైతులకు పరిహారాన్ని చెల్లించాలని రాష్ట్ర ఉప లోకాయుక్త పి.రజని మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. మంత్రాలయం మండలంలోని చిలకలడోన గ్రామంలోని గురు రాఘవేంద్ర ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టాన్ని జలవనరుల శాఖ అధికారులు తప్పుగా నిర్ధారించడంతో తమ పొలాలు మునిగి నష్టపోయినట్లు రైతు ఆర్.రాఘవరెడ్డి ఉప లోకాయుక్తకు గతంలో ఫిర్యాదు చేశారు. ఉప లోకాయుక్త ఈ కేసును విచారించి కర్నూలు కలెక్టర్, జలవనరుల శాఖ అధికారులకు నివేదికలు అందజేయాలని ఆదేశించారు. దీంతో అధికారులు విచారించి ప్రాజెక్టు కింద ఉన్న 53 మంది రైతులు నష్టపోయారని నిర్ధారించి, వారికి రూ.13,40,740 నష్ట పరిహారంగా నిధులు మంజూరు చేశారు.





నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: డీపీవో



డీపీవోకు పుష్పగుచ్ఛం ఇస్తున్న సిబ్బంది

నంద్యాల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జిల్లాను అన్ని విధాల అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి సూచించారు. పట్టణంలోని డీపీవో కార్యాలయంలో మంగళవారం ఆమె డీపీవోగా బాధ్యతలు స్వీకరించారు. సిబ్బందితో పరిచయ కార్యక్రమం అనంతరం డీపీవో మాట్లాడారు. గ్రామ పంచాయతీల పురోగాభివృద్ధికి, ఆర్థిక వనరుల సృష్టికి చక్కటి మార్గదర్శకం చేస్తామని అన్నారు. వర్షాకాలంలో పారిశుధ్య చర్యలకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. తాగునీటి ట్యాంక్‌ల శుభ్రత, ప్రజారోగ్య సంరక్షణ కోసం ఎప్పటికప్పుడు సిబ్బంది సూచనలు చేస్తామన్నారు. డీఎల్‌డీవో శివారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మహానందిలో పూజలు

మహానంది: మహానంది క్షేత్రంలో మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి లలితాబాయి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ ముఖద్వారం వద్ద గ్రామ పంచాయతీ కార్యదర్శి కలువ భాస్కర్ ఆధ్వర్యంలో అర్చకుడు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరుడికి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు అభిషేకార్చన పూజలు చేశారు. అనంతరం అలంకార మంటపంలో వీరిని వేదపండితులు ఆశీర్వదించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్య శాలువాతో సన్మానించి, స్వామి వారి మెమెంటో, ప్రసాదం అందజేశారు. వీరి వెంట ఈవోఆర్డీ నాగేంద్రుడు ఉన్నారు.

బిల్లుల చెల్లింపులో అవకతవకలపై విచారణ



బిజినవేములలో విచారిస్తున్న డీఎల్‌పీవో రాంబాబు

నందికొట్కూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజినవేముల గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నూతన సచివాలయ భవన నిర్మాణంలో అవకతవకలు జరిగాయంటూ వచ్చిన ఫిర్యాదులపై నంద్యాల డీఎల్‌పీవో రాంబాబు విచారణ చేపట్టారు. మంగళవారం నంద్యాల డీఎల్‌పీఓ రాంబాబు బిజినవేముల గ్రామం సచివాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. 2020 సంవత్సరంలో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో సచివాలయ నిర్మాణం జరుగుతున్న సమయంలో బిల్లుల చెల్లింపులో అవకతవకలు జరగాయని సగినేల వెంకటేశ్వర్లు అనే కాంట్రాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గతంలో ఇక్కడ పనిచేసిన గ్రామ కార్యదర్శి, గ్రామ సర్పంచ్‌ను విచారించాల్సి ఉందన్నారు. విచారణ పూర్తి అయిన తర్వాత నివేదికను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శరత్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో శారద

గడివేముల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అడిషనల్ డీఎంహెచ్‌వో శారద సూచించారు. మండలంలోని తిరుపాడు గ్రామంలో మంగళవారం జరిగిన సంచార చికిత్స కేంద్రాన్ని తనిఖీ చేశారు. గల్ల పరీక్షల కోసం ఎన్ని శాంపిళ్లు తీశారని ఆరా తీశారు. టీబీ రోగులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని అన్నారు. ప్రభుత్వ వైద్యులు తేజశ్వని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి

పగిడ్యాల, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై ఉద్యమాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రఘురామ్మూర్తి అన్నారు. ప్రాతకోటలో మంగళవారం మండల కార్యదర్శి అబ్దుల్ మజీద్ ఆధ్వర్యంలో సీపీఐ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. రఘురామ్మూర్తి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు, మహిళలు, కూలీలు, విద్యార్థి సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్నామన్నారు. ప్రాతకోట గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని, మూతపడిన తూమును తెలరిపించి రైతులకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని, లక్ష్మాపురం అంచె సమీపం నుంచి నందికొట్కూరుకు వెళ్లే ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టేలా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎనుకున్నారు. సీపీఐ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, అబ్దుల్ కలాం, వెంకటేశ్వర్లు, మాబాషా, ఉసేనాలం తదితరులు ఉన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా సులోచన

పాములపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పాములపాడుల ఎంపీడీవో కార్యలయంలో నూతన డిప్యూటీ ఎంపీడీవోగా సులోచన మంగళవారం బాధ్యతలు చేపట్టారు. దొర్నిపాడు మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసి స్టెంట్లతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ యోగా దినోత్సవం, జీఎస్‌డబ్ల్యూఎస్ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

వీపనగండ్లలో కార్డన్ సెర్చ్

మిడుతూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీపనగండ్ల గ్రామంలో రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మంగళవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో అనుమానిత వ్యక్తుల ఇళ్లల్లో విస్తృత సోదాలు చేశారు. 21 మద్యం బాటిళ్లు, ఎలాంటి రికార్డు లేని 9 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఒబులేసు, పోలీసులు పాల్గొన్నారు.

కలప వేలం

మహానంది, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గాజులపల్లి ఆర్‌ఎస్‌లోని అటవీ కలప డిపోలో మంగళవారం బహిరంగ వేలాలు నిర్వహించగా రూ.1.27 లక్షల ఆదాయం వచ్చినట్లు ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ జడ్ ఇన్‌జా తెలిపారు. నల్లమల నుంచి అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ కలపను సిబ్బంది దాడులు జరిపి స్వాధీనం చేసుకున్న కలపకు డిపోలో బహిరంగ వేలాలు నిర్వహించారు.

చిన్నారులకు ఆధార్ అప్‌డేట్ తప్పనిసరి : కలెక్టర్

నంద్యాల నూనెపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాలు దాటిన పిల్లల ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పని జరిగా చేయించాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా స్థాయి ఆధార్ మోనిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటర్ విద్యార్థులు పోటీ పరీక్షలు రాసే అవకాశం ఉండడంతో తప్పనిసరిగా ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని డీఈవో జనార్దన్‌రెడ్డిని ఆదేశించారు. జిల్లాలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయడానికి అవసరమైన శిక్షణలో ఎస్వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో డీఎల్‌డీవో శివారెడ్డి, జీఎస్‌డబ్ల్యూఎస్ సమన్వయకర్త ఖాదర్, ఆధార్ రీజనల్ కార్యాలయ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

సిబ్బంది దామోదర్, ఐసీడీఎస్ పీడీ లీలావతి, డీఎంహెచ్‌వో వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో 11 ఏళ్లుగా స్వర్ణ యుగం: బీజేపీ



నందికొట్కూరులో కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న బీజేపీ నాయకులు

నందికొట్కూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): దేశంలో 11ఏళ్లుగా స్వర్ణ యుగం నడుస్తోందని బీజేపీ జిల్లా కార్యదర్శి గూడూరు రవికుమార్‌రెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జి దామోదర్‌రెడ్డి అన్నారు. దేశంలో బీజేపీ పాలనకు 11ఏళ్లు పూర్తయ్యి 12 ఏళ్లలోకి అడుగుపెట్టిన సందర్భంగా నందికొట్కూరులో బీజేపీ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందని అన్నారు. ప్రజలకు సంక్షేమం కోసం ఎన్నో పథకాలు కేంద్రం ప్రవేశపెట్టిందని అన్నారు. అనంతరం పట్టణంలో నరేంద్రమోదీ సంక్షేమ పథకాల కరపత్రాలను పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వేణుగోపాల్, కృష్ణ యాదవ్, రాజ్‌కుమార్, శ్రీకాంత్ రావు, మధు, నాగేంద్ర, సురేష్, శేఖర్, మధు కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో..

మిడుతూరు: మిడుతూరు కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి మంగళవారం బీజేపీ నాయకులు ప్రజలకు అవగాహన కల్పించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దామోదర్ రెడ్డి కేంద్ర పథకాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. నాయకులు రాజారెడ్డి, చిట్టిబాబు, వెంకటేశ్వర్లు, నాగేశ్, కేశాలు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: దేశంలో 11ఏళ్ల బీజేపీ పాలనలోని వికసిత్ భారత్ లక్ష్యాల గురించి మంగళవారం ఆ పార్టీ జాతీయ మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబాన ఆత్మకూరులోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ.. వికసిత భారత దేశానికి ప్రధానీ మోదీ పాలన అమృతకాలంగా నిలిచిందని అన్నారు. అనేక సంక్షేమ పథకాలతో దేశంలో పేదరిక నిర్మూలనకు ప్రధాని మోదీ ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు రవీంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.

'ఆధిపత్యం కోసమే యుద్ధం'

నంద్యాల రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయిల్ దేశం పాలస్తీనాపై, ఇరాన్‌పై యుద్ధం ఆధిపత్య కాంక్షతోనే చేస్తున్నారని వామపక్షాల నాయకులు నాగరాజు, బాబా ఫక్రుద్దీన్ అన్నారు. పట్టణంలోని పద్మావతి నగర్‌లో మంగళవారం నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ శాంతి చర్చలతో యుద్ధం ముగించాలని కోరారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకుల పాల్గొన్నారు.

ఆత్మకూరు: గాజాలోని పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ ప్రభుత్వం సాగిస్తున్న యుద్ధాన్ని ఆపేసి శాంతిని నెలకొల్పాలని సీపీఎం నాయకులు రణధీర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదుట పాలస్తీనియన్లకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రామ్‌నాయక్, వీరన్న, వకీర్, గోపాలకృష్ణ తదితరులు ఉన్నారు.

రైతు సమస్యలపై పోరాటం

నందికొట్కూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని భారత రైతు కూలీ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహులు పిలుపునిచ్చారు. మంగళవారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో కరపత్రాలను విడుదల చేశారు. నరసింహులు మాట్లాడుతూ అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర కమిటీ జూన్ 16 నుంచి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించిందని చెప్పారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా రైతుకు ప్రారంభ పెట్టుబడి కింద రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీలు చెల్లించలేదన్నారు. ఉచిత బీమా పథకాన్ని ఎత్తివేశారన్నారు. ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు, ఎరువులు పురుగుల మందులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్నారు.

'పొగాకును త్వరగా కొనాలి'

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పొగాకు కొనుగోళ్లు త్వరితగతిన కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా భారతీయ కిసాన్ మోర్చ నాయకులు జేసీ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. కిసాన్ మోర్చా జిల్లా నాయకులు తాడి రామకృష్ణారెడ్డి, తూము శివారెడ్డి, గంగాధర్, ప్రసాద్‌రాజు, రామచంద్రారెడ్డి మాట్లాడుతూ పొగాకు బోర్డు ద్వారా నిల్వలను త్వరగా కొనుగోలు చేసేలా కంపె నీలపై ఒత్తిడి తీసుకరావాలని కోరారు. పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగోలు చేసిన జొన్నలకు సంబంధించిన నగదు రైతులకు జమ కాలేదని, రైతుల పంట భూములకు సంబంధించి ఇనాం భూములు నమోదు కావడంపై చర్యలు తీసుకుని రైతుల భూహక్కు పత్రాల్లో మార్పులు చేయాలని విజ్ఞప్తి చేశారు. సాంబశివుడు, గోపాల్‌రెడ్డి, సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

గోస్పాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని, పెండింగ్ కూలి డబ్బులు వెంటనే ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యద ర్శి బాబాపకృద్దీన్ డిమాండ్ చేశారు. మంగళవారం యాళ్లూరు, శ్రీనివాసపురం గ్రామాల్లో వ్యవసాయ కూలీలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండల కార్యదర్శి హరినాథ్, శ్రీనివాసులు, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆత్మకూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ డీఈ రామసుబ్రమణ్యం తెలిపారు. న్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు సబ్‌స్టేషన్ పరిధిలోని ఐదు మెగా వోల్ట్ ఆమ్స్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో 8 మెగా వోల్ట్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించి ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపిస్తున్నట్లుల వివరించారు. ఈ విషయాన్ని మండల, పట్టణ ప్రజలు గుర్తించి తమకు సహకరించాలని కోరారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు సహకారం

● నాబార్డు ఏజీఎం కార్తీక్



అల్లూరులో మాట్లాడుతున్న నాబార్డు ఏజీఎం కార్తీక్

నందికొట్కూరు రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసుకున్న రైతు ఉత్పత్తి దారుల సంఘాలకు నాబార్డు నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని నంద్యాల జిల్లా నాబార్డు ఏజీఎం కార్తీక్ తెలిపారు. మండలంలోని అల్లూరు గ్రామంలో మంగళవారం రైతులు ఏర్పాటు చేసిన అవని రైతు ఉత్పత్తి దారుల సంఘాన్ని(ఎఫ్‌పీవో) పరిశీలించారు. రైతులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏజీఎం మాట్లాడుతూ రైతులు సంఘటితంగా ఇన్‌పుట్ అలాగే అవుట్‌పుట్ వ్యాపారాలు హోల్‌సేల్‌గా నిర్వహించుకోవాలని సూచించారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, అనిమల్ హస్బెండరీ అన్ని ప్రభుత్వ డిపార్టుమెంట్ స్కీములను అందుబాటులోకి వచ్చేలా సంఘం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్, సీఈవోలు కృషి చేయాలని సూచించారు. ఎఫ్‌పీవో అభివృద్ధి కోసం నాబార్డు అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని రైతులకు తెలిపారు. ఇదే సందర్భంలో పీఏసీఎస్ సెక్రటరీ అశోక్ మాటా్లడుతూ త్వరలో రైతులకు ఎరువులు, పురుగు మందులు అందుబాటు లోకి తెస్తున్నామన్నారు. కార్యక్రంలో ఎఫ్‌పీవో డైరెక్టర్ బి. జయమ్మ, లక్ష్మీనారాయణరెడ్డి, నారాయణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే చర్యలు

పాణ్యం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం నెరవాడ మెట్టలోని ఆటో డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు, ఈవ్ టీజింగ్, తదితర అసాంఘిక కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. నెరవాడ మెట్ట సమీపంలో రెండు ఇంజనీరింగ్ కళాశాలలు, పార్మసీ, రెండు ఏపీ గురుకుల పాఠశాలలు. ఒక మిగీ గురుకుల పాఠశాల ఉందన్నారు. ఈన మేరకు విద్యార్థులు నిత్యం ఈ ప్రాంతాంలో సంచరిస్తూ విద్యనభ్యసిస్తుంటారన్నారు. ఎక్కువగా బాలికలు ఉండడంతో మరింత జాగ్రత్తగా ఉండేలా చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. ఆటో డ్రైవర్లు బాధ్యతతో వాహనాలు నడపాలని, ప్రయాణీకుల పట్ల బాధ్యత వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాల విక్రయంపై నిఘా ఉంచాలి

ఆత్మకూరు, జూన్ 17(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండల, పట్టణ ప్రాంతాల్లో నకిలీ విత్తనాల విక్రయాలు జరగకుండా విజిలెన్స్, వ్యవసాయాధికారులు నిఘా ఉంచాలని సీపీఐ నాయకులు రమేష్ బాబు, టి.ప్రతాప్ అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఆత్మకూరు ప్రాంతాల్లో పలు సీడ్స్ కంపెనీలు నాసిరకం విత్తనాలను రశీదులను తారుమారు చేస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్నారని అన్నారు. దీంతో రైతులు అయోమయానికి గురికావాల్సి వస్తుందని చెప్పారు. నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోతే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని అన్నారు. నకిలీ విత్తనాలతో పాటు బయో మందులపై వ్యవసాయాధికారులు తనిఖీలు చేసి రైతులకు ఆసరాగా నిలవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు వీరానారాయణ, షేక్షావలి, దేవా, సయ్యద్ తదితరులు ఉన్నారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలి

మహానంది: కౌలు రైతులు గుర్తింపు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని బొల్లవరం గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని వ్యవసాయ సిబ్బంది నిర్వహించారు. వ్యవసాయాధికారి వరిపంటలో ముడి జింకు ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. గంధకం కలిగిన కాంపెక్స్ ఎరువులను అధికంగా వాడటం వల్ల వరి పంటలో వేర్లు కుళ్లిపోయి మొక్కలు చనిపోతాయని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాసరెడ్డి, వీపీఏ చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

నేలలో కర్బన శాతం పెంచాలి

నంద్యాల రూరల్: నేలలో కర్బన శాతం పెంచాలని నంద్యాల మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని రాయమాల్పురం, మునగాల గ్రామాలలో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు వరి సాగుకు ముందు పచ్చిరొట్టె ఎరువులైన జీలుగ, పిల్లిపెసర, మినుము సాగు చేయాలని సూచించారు. ఇందువల్ల భూమిలో కర్బన శాతం పెరిగి ఆరోగ్యంగా ఉంటుందన్నారు. వరి గట్లపై కంది, కూరగాయలు సాగు చేయడం వల్ల అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందల వాడకాన్ని తగ్గించాలని కోరారు. వరిలో ఎన్‌డీఎల్‌ఆర్-7, ఆర్‌ఎన్‌ఆర్- 15048 రకాలు ఖరీస్ సాగుకు అనువైనవిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి మనోహర్, గ్రామ వ్యవసాయ సహాయకుడు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

విత్తనశుద్ధి చేసుకోవాలి

గోస్పాడు: ఖరీఫ్‌లో వేసే పంటలకు విత్తన శుద్ధి చేసుకోవాలని ఏవో స్వప్నిక సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా చింతకుంట్ల, గోస్పాడు గ్రామాలలో మినుము పంటను పరిశీలించారు. విత్తనశుద్ధి ఎలా చేసుకోవాలో రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఏఈవో రామకృష్ణ, సంధ్య, ఉష, సుమలత పాల్గొన్నారు.

పంటమార్పిడితో అధిక లాభాలు

బండిఆత్మకూరు: సాగులో రైతులు పంట మార్పిడి విధానం పాటించడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని ఏవో పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని ఈర్నపాడు, కడమలకాల్వ గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని సర్పంచ్‌లు వెంకటలక్ష్మమ్మ, మేరీ పుష్పాంజలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఏవో మాట్లాడుతూ చిరుధాన్యాల సాగు, ఏడాదికి మూడు పంటలు వేయటం వల్ల ఎన్నో లాభాలు పొందవచ్చన్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు రావాలంటే అనవసర ఖర్చులు తగ్గించాలని సూచించారు. మండలంలో 6,955 మంది రైతులు అన్నదాత సుఖీభవ లబ్ధికి అర్హులని, కేవలం ఈకేవైసీ చేయించని అన్నదాతలు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి చేయించుకోవాలని సూచించారు.

మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

● ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలలో భాగంగా తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ డబ్బులు ఇస్తామన్న హామీని అమలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట నిలబెట్టుకున్నారని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నందుకు జగన్మోహన్‌రెడ్డి అక్కస్సు వెళ్లగక్కుతూ లేనిపోని ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు. గత ప్రభుత్వంలో జగన్ ఇంటికి ఒకరికి మాత్రమే నగదు అందిస్తే ఇప్పుడు కూటమి ప్రభుత్వం కుటుంబంలోని పిల్లలందరికీ పథకం వర్తింపజేసిందని చెప్పారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, కౌన్సిలర్ భాస్కర్ రెడ్డి, జాకీర్ హుస్సేన్, టీడీపీ నాయకులు పలుచాని మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



నంద్యాలలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఏవీఆర్ ప్రసాద్

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల ఎస్పీజీ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఏవీఆర్ ప్రసాద్ మంగళవారం విద్యార్థుల పంపిణీ చేశారు. హెచ్‌ఎం జీవలత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఏవీఆర్ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ కృపాకర్ హాజరయ్యారు. విద్యార్థులకు కిట్‌లను పంపిణీ చేసిన అనంతరం వారు మాట్లాడుతూ తల్లికివందనం ద్వారా విద్యార్థుల తల్లులకు డబ్బులు జమచేసి విద్యారంగ పక్షపాత కుటుంబంగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు.

బండిఆత్మకూరు: విద్యార్థుల తల్లి దండ్రులు మేలు చేసిన కూటమి ప్రభుత్వాన్ని ఏమాత్రం మరువరాదని మండల టీడీపీ అధ్యక్షుడు నాగకృష్ణారెడ్డి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ రమేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం బండిఆత్మకూరు మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు విద్యా సామగ్రిని టీడీపీ నాయకులు, అధ్యాపకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఫీక్, నాయకులు జాకీర్, మధురెడ్డి, లక్ష్మిరెడ్డి, నందయ్య, అంజాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయాలి

నంద్యాల ఎడ్యుకేషన్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): కేరళలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్‌ఎఫ్‌ఐ అఖిలభారత మహాసభను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టరును ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మంగళవారం నంద్యాలలో విడుదల చేశారు. ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తూనే ఉన్నామన్నారు.

ఉద్యోగాల పేరిట మోసపోవద్దు: డీఎస్పీ

పాములపాడు, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ నియామకంలో కొంతమంది వ్యక్తులు ఉద్యోగాలు ఇప్పిస్తామంటే మోసపోవద్దని, పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారికే ప్రాధాన్యం ఉంటుందని ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్ అన్నారు. మంగళవారం రాత్రి లింగాల గ్రామంలో పాములపాడు ఎస్ఐ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో డీఎస్పీతో పాటు సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలని, మహిళలపై జరిగే నేరాలు, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు.

జంబులా పరమేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు

పాణ్యం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో జంబులా పరమేశ్వరీదేవి ఆలయంలో మంగళవారం భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, అర్చనలు, పూజలు చేశారు. భక్తులు తమ కోర్కెలు తీర్చుకొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకోవడంతో ఆలయం కిటకిట లాడింది. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త బొమ్మిశెట్టి శేఖర్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వేదపండితులు కృష్ణకుమార్ శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీశైలంలో నందీశ్వరస్వామికి పూజలు



పూజలు చేస్తున్న అర్చకుడు

నంద్యాల కల్చరల్ (శ్రీశైలం), జూన్ 17(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలోని ఆలయ ప్రాంగణంలో లోని నందీ శ్వర స్వామికి మంగళ వారం విశేష అర్చనలు చేశారు. అర్చకులతో నందీశ్వర స్వామికి శాస్త్రో క్తంగా పంచామృతాలతోనూ, ఫలోదకాలతో హరిద్రో దకం, కుంకుమోదకం, రుద్రాక్షోదకం, బిల్వోదకం, పుష్పో దకం, సువర్ణోదకం, శుద్ధజలంతో అభిషేకాలు నిర్వహించారు. చివ రగా నందీశ్వరుడికి నానబెట్టిన శనగలను స్వామివారికి సమర్పించారు.

● శ్రీశైలంలోని సాయంకాలం శ్రీశైలక్షేత్ర పాలకుడైన బయలు వీరభద్ర స్వామికి విశేషపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

● శ్రీశైలక్షేత్రంలో మంగళవారం లోక కల్యాణార్థం ఆలయ ప్రాంగణంలో ఉదయం సుబ్రహ్మణ్యస్వామి విశేష పూజలు ఆలయ వేదపండితులతో నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారస్వామికి దేవస్థాన సేవగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకానికి ముందుగా మహా గణపతిపూజ, పంచామృత అభిషేకం, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

● శ్రీశైల క్షేత్రంలో మంగళవారం సాయంకాలం నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా ఏలూరు భారతీ భాగవతార్ చే శివలీలలపై హరికథాగానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తబల శ్రీకృష్ణ, కీబోర్డు బాలస్వామి సహకారాన్ని అందించారు. అనంతరం హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

ఏరువాక సాగేదెలా..?

- సబ్సిడీ విత్తనాలు, ఎరువుల కొరత
- పట్టించుకోని అధికారులు ● గగ్గోలు పెడుతున్న రైతులు


పొలం పనుల్లో కాడెద్దులతో దున్నుతున్న రైతు

డోన్ టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): తొలకరి జల్లులు పడటంతో అన్నదాతలు పొలాలకు పరుగులు తీస్తూ సాగుకు సమాయత్తం అవుతున్నారు. వేసవి దుక్కులు దున్నుతున్న రైతులు విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. విత్తుకు అవసరమైన సరంజామాను సిద్ధం చేసుకుంటూ పొలాల్లో పనుల్లో నిమగ్నమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతన్నల సందడితో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. సహకార సంఘాలు, ఎరువుల దుకాణాలకు వెళ్లి నానా అవస్థలు పడుతున్నారు. అయితే విత్తనాల కొరతతో ఏరువాక సాగేదెట్లా అంటూ రైతన్నలు బెంగ పడుతున్నారు. మొన్ననే ఏరువాక పౌర్ణమిని సంబరంగా ముగించుకున్న రైతులు ఇప్పుడు ఆందోళన లో పడ్డారు. అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెబుతున్నా కూడా అన్న దాతలను మాత్రం పలు సమస్యలు వెంటాడుతున్నాయి. వేరుశ నగ విత్తనాల కొరత ఎంఆర్‌పీ ధరల కంటే అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తూ రైతులను దగా చేస్తున్నారు. నియోజకవర్గంలో సాధారణ సాగు వేలల్లో హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేస్తున్నట్లు అధికారుల అంచనా, ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పలు ప్రాంతాల్లో వేరుశనగ విత్తనాల కొరత ఏర్పడింది. ఈ ఏడాది వర్షాలు కూడా ముందస్తు నుంచి కురుస్తూ రానున్న రోజుల్లో పెరిగే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. ఈ దశలో రైతులు విత్తనాల కోసం మండల వ్యవసాయ కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించి రైతులు ఆదుకోవాలని కోరుతున్నారు.

తప్పులు లేని ఓటరు జాబితాను రూపొందించాలి


మాట్లాడుతున్న ఆర్డీవో విశ్వనాథ్

ఆళ్లగడ్డ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): తప్పులు లేని ఓటరు జాబితా తయారీకి సమన్వయంతో పని చేయాలని ఆర్డీవో విశ్వనాథ్ సూచించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నియోజకవర్గంలోని పొలిటికల్ పార్టీ ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలస వెళ్లిన వారి ఓట్లను బదిలీ చేయడంతో పాటు మరణించిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన కొత్త ఓటర్లను నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ జ్యోతి రత్న కుమారి, రెవెన్యూ అధికారులు, పార్టీల నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

అహోబిలంలో యోగాంధ్ర ఏర్పాట్ల పరిశీలన

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలంలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో విశ్వనాథ్ తెలిపారు. మంగళవారం ఏర్పాట్లను టూరిజం అధికారులతో కలిసి ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ రాజకుమారి పాల్గొంటారన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జ్యోతిరత్నకుమారి, అధికారులు ఉన్నారు.

పండ్ల తోటల సాగుకు చేయూత :పీడీ


సాగు చేసిన తోటను పరిశీలిస్తున్న పీడీ

శిరివెళ్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : పండ్లు, పూల తోటల సాగుకు ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు చేయూ త అందిస్తున్నట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్య నారాయణ తెలిపారు. మండలంలోని యర్రగుంట్ల, శిరివెళ్ల గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా రైతులు సాగు చేసిన మునగ, మామిడి, మల్లె తోటలను ఆయన మంగళవారం పరిశీలించారు. జిల్లాలో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం వీరారెడ్డిపల్లె గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏపీడీ సాంబశివరావు, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ వెంకట సుబ్బయ్య, ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప, ఏపీవో రామసుబ్బయ్య, టెక్నికల్ అసిస్టెంట్లు బాలకృష్ణ, ఉమాశంకర్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

చిన్నారులను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి

ఉయ్యాలవాడ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్ల పైబడ్డ చిన్నారులను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఎంఈవో-1 రఘురామిరెడ్డి సూచించారు. ఎన్‌రోల్‌మెంటు డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సర్వాయిపల్లె గ్రామంలో పర్యటించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కార్యకర్త సుశీల, ఆయా ఉన్నారు.

ఎమ్మార్సీ విద్యుత్ బిల్లులు పెండింగ్

రుద్రవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రుద్రవరం విద్యాశాఖ కార్యాలయంలో విద్యుత్ బిల్లులు గత ఏడాది ఏప్రిల్ నుంచి చెల్లించలేదు. దాంతో ఇప్పటివరకు రూ.26,181 విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నది. 2024-25 విద్యాసంవత్సరానికి గాను మెయింటెనన్స్ నిధులు రూ. 1.30లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిని 2025 మార్చి వరకు కార్యాలయ నిర్వహణ కోసం ఖర్చు చేయాల్సి ఉంది. కానీ, అప్పటి ఎంఈవో 2024 నవంబరు మాసంలో ఒకే సారి డబ్బులు డ్రా చేశారు. కానీ ఏప్రిల్ మాసం నుంచి చెల్లించాల్సిన విద్యుత్ బిల్లులు చెల్లించలేదు. మెయింటెనెన్స్ నిధులు వచ్చినా బిల్లులు చెల్లించలేదన్న విమర్శలున్నాయి. ఇన్‌చార్జి ఎంఈవో వీరరాఘవయ్యను వివరణ కోరగా 2025 జనవరిలో బాధ్యతలు స్వీకరించాను. విద్యుత్‌బిల్లులు 2024 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు రూ.26181 పెండింగులో ఉన్నాయి. ఇప్పటి వరకు ఎంఈవో కార్యాలయం ఇన్‌చార్జి అప్పగించలేదు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రుద్రవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి కావ్య సూచించారు. మంగళవారం రుద్రవరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆమె మాట్లాడారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అప్పుడే ఆరోగ్యంగా ఉంటామన్నారు. నీటిని వేడి చేసుకుని చల్లార్చి తాగాలన్నారు. అనారోగ్యంగా ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు.

ప్రజల మన్ననలు పొందాలి: ఎంపీడీవో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమణ

బనగానపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మంచి సేవలు అందించి ప్రజల మన్ననలు అధికారులు పొందాలని ఎంపీడీవో రమణ అన్నారు. మంగళవారం ఎంపీపీ మానసవీణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏవో సుబ్బారెడ్డి, హౌసింగ్ ఏఈ బాలచంద్రుడు, విద్యుత్ శాఖ ఏఈలు శ్రీనివాసులు, గర్జప్ప, ఏపీఓ ప్రతాప్, పంచాయతీరాజ్ ఏఈ రమణ , పశువైద్య అధికారి డాక్టర్ శ్రీకాంత్, ఉపాధ్యాయుడు సతీశ్ ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ అధికారులు ప్రజలు కార్యాలయాలకు వస్తే గౌరవించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం అధికారులు సమన్వయంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుబ్బలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు సర్పంచ్‌లు మహేశ్వరరెడ్డి, తులసిరెడ్డి, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల నుంచి రక్షించాలి

- మున్సిపల్ కార్యాలయం ముందు సీపీఐ, వైసీపీ ధర్నా
- కమిషనర్‌కు వినతి పత్రం అందజేత


మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

బేతంచెర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వీధి కుక్కల నుంచి చిన్న పిల్లల ప్రాణాలను కాపాడాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్‌యన్నా, వైసీపీ పట్టణ కన్వీనర్ పిట్టల జాకీర్‌హుశేన్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ, వైసీపీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ముందుగా కుక్క దాడిలో గాయపడిన ప్రణీత్ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం చేరుకుని ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలుడు ప్రణీత్ వైద్య ఖర్చులను మున్సిపల్ అధికారులు భరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ, వైసీపీ నాయకులు తిరుమలేశ్వర్ రెడ్డి, పి.నాగరాజు బుగ్గన బాస్కర్ రెడ్డి, ఉదయ్, నాగవెంకటేశ్వర్లు, తిరుమలేష్ , దస్తగిరి, రాందాసు, నాగరాజు, షరీఫ్; శ్రీను, వేణు, బబ్లూ, శంకర్, ఎద్దులన్న, వలి, కమాల్, ఆడపాల తిరుమలేష్; సందాని, చింటూ, ప్రదీప్, మధు కార్తిక్, సాయి, బాలుడి తండ్రి పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మించాలి


మున్సిపల్ చైర్మన్ వినతి పత్రం అందిస్తున్న క్రైస్తవ సంఘం నాయకులు

డోన్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గుత్తిరోడ్డులోని క్రిస్టియన్ సమాధుల తోట ప్రహరీ నిర్మించాలని సమైఖ్య క్రైస్తవ మైనార్టీ సంఘంఅధ్యక్షుడు జాకబ్ పాల్, కార్యదర్శి గడ్డం రాజశేఖర్, జాయింట్ సెక్రటరీ ప్యానెల్ కోశాధికారి చిట్టెం బాబు కోరారు. 16వ వార్డు కౌన్సిలర్ సుంకయ్యతో కలిసి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ ప్రసాద్‌గౌడులకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన చైర్మన్ అధికారులతో కలిసి కూలిన ప్రహరీని పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ కోట్రికే హరికిషన్, కౌన్సిలర్లు సుంకయ్య, నాగేంద్ర, మున్సిపల్ ఏఈ, డీఈలు, వైసీపీ నాయకుడు భాస్కర్, పాస్టర్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

ఆర్‌పీ అక్రమాలపై విచారణ చేపట్టాలి

డోన్ టౌన్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘంలో చోటు చేసుకున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన మయూరి పొదుపుసంఘం లీడర్ లలిత, సభ్యులు కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్ ఇమామ్ హుశేన్‌కు సంఘం సభ్యులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పొదుపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

బేతంచెర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏవో విజయకుమార్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కిరణ్‌కుమార్ ఎమ్మిగనూరు భూసార పరిశోధన కేంద్రానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా నూతన ఏవోకు వ్యవసాయ సిబ్బంది ఏఈవోలు మధు, మహ్మద్, గ్రామ సచివాలయాల సిబ్బంది పూలబొకే అందజేసి స్వాగతం పలికారు.

కార్మికుల దీక్షకు ఎంహెచ్‌పీఎస్ నాయకుల మద్దతు

బేతంచెర్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిమెంటు ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులకు మంగళవారం ఎంహెచ్‌పీఎస్ మైనార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు అన్యాయం చేయడం సమంజసం కాదన్నారు. కార్మికులపై విమర్శలు మానుకోవాలన్నారు. కార్మిక శాఖ అధికారులు చొరవ తీసుకొని ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చించి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంహెచ్‌పీఎస్ డోన్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఇద్రుస్ బాషా, ప్యాపిలి సయ్యద్ అక్బర్ వలి, ముస్తఫా, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, భాస్కర్ రెడ్డి, కృష్ణవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, కార్మికులు మోజెస్, జయక్రిష్ణ, నరసింహస్వామి, మద్దయ్య, శ్రీనివాసులు, ఎల్ల నాయుడు, శ్రీను, రామసుబ్బయ్య తదితరులున్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్యాపిలి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని డోన్ మోటారు, వెహికల్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు దాటేటప్పుడు విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బైకు కలిగిన విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం ఆయన బస్టాండ్ ఎదురుగా వాహనాల తనిఖీలు నిర్వహించి జరిమానాలు విధించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

శిరివెళ్ల, జూన్ 17(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోవిందపల్లె గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న మహిళ మృతి చెందారు. శిరివెళ్ల ఎస్‌ఐ చిన్న పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. యర్రగుంట్లకు చెందిన అనసూయమ్మ, ఆమె సోదరుడు పుల్లారెడ్డి ఈ నెల 15న ద్విచక్రవాహనంపై కామినేనిపల్లె గ్రామం నుంచి యర్రగుంట్లకు వెళ్తుండగా గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఎదురుగా ఢీకొట్టిందన్నారు. ఈ ఘటనలో అనసూయమ్మ తీవ్రంగా గాయపడగా నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లగా మృతి చెందారన్నారు. మృతురాలి సోదరుడు పుల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

విద్యార్థినులకు నగదు బహుమతి

బనగానపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన బనగానపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు షాహినా పర్వీన్, జి.వైష్ణవి, దివ్య ఆఫ్రిన్‌లను టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా నగదు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో కళాశాల అధ్యాపకుడు కిశోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు తీవ్ర గాయాలు

బనగానపల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపురంలో ఇద్దరి ఉపాధి కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. మంగళవారం ఉపాధి పని ముగించుకొని ట్రాక్టర్‌పై తిరిగి ఇంటికి వస్తుండగా ట్రాక్టర్ నుంచి కిందపడడంతో కూలీలు బొంతా వేదనాయకం, బుడిగి కృష్ణుడికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. తలకు, కాళ్లకు, చేతులకు తీవ్రంగా గాయాలు కావడంతో 108లో బేతంచెర్లకు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ వైద్యులు ప్రాథమిక పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నందివర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అతుకులు సరే.. రోలింగ్ ఏదీ?


పేరూరు సమీపంలో రహదారిపై పడిన గుంతలకు వేసిన తారు

రుద్రవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పేరూరు - చందలూరు రహదారిలో గుంతలకు సోమవారం అతుకులు వేశారు. కానీ రోలింగ్ చేయడం మరిచారు. అధికారులు నిర్లక్ష్యానికి అద్దం పట్టింది. తారు కలిపిన కంకర గుంతల్లో పోశారు. రోలింగ్ చేయలేదు. అతుకులు ఎన్ని రోజులు ఉంటాయో అధికారులకే తెలియాలని వాహనదారులు విమర్శిస్తున్నారు. ఇలా చేస్తే ఎలా అని పేరూరు , చిలకలూరు, చందలూరు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన

బనగాన పల్లె, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి పల్లె గ్రామంలో రైతులకు మొక్కజొన్న సాగుపై వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి మంగళవారం అవగాహన కల్పించారు. విత్తనం, ఎరువులు, తీసుకోవాల్సిన జాగ్రత్తను వివరించారు. పురుగు మందులు అవసర మైన మేరకే పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు.

వేరుశనగ విత్తనాల పంపిణీ

డోన్ రూరల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామంలో రైతులకు మంగళవారం వేరుశనగ విత్తనాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐ చేయించుకోండి

కోవెలకుంట్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : తల్లికి వందనం డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ కాకుంటే బ్యాంకులు, పోస్టాఫీసుల వద్దకు వెళ్లి ఎన్‌పీసీఐ లింకు చేయించుకోవాలని ఎంపీడీవో వర ప్రసాద్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి తల్లికి వందనం పథకానికి అర్హులన్నారు. మండలంలో 88 మంది విద్యార్థుల తల్లులకు డబ్బులు పడలేదన్నారు. తల్లులు బ్యాంకుల్లో కానీ, పోస్టాఫీసుల్లో కానీ ఎన్‌పీసీఐ లింకు చేయించుకుంటే డబ్బులు పడతాయని పేర్కొన్నారు.

సీనియర్ అసిస్టెంటుగా నాగలక్ష్మమ్మ

కోవెలకుంట్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : కోవెలకుంట్ల ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా నాగలక్ష్మమ్మ బాధ్యతలు చేపట్టినట్లు ఎంపీడీవో వర ప్రసాద్‌రావు తెలిపారు. ఇక్కడి సీనియర్ అసిస్టెంటు రామసుబ్బయ్య ఏవోగా పదోన్నతి పొంది ఆళ్లగడ్డకు వెళ్లారు. ఆత్మకూరు నుంచి నాగలక్ష్మమ్మ కోవెలకుంట్లకు వచ్చారన్నారు.

పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పశువుల వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముత్యాలపాడు మండల పశువైద్యాధికారి నందిని తెలిపారు. మంగళవారం పశువైద్యశాలలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడిపరిశ్రమ అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి

చాగలమర్రి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు సేంద్రియ ఎరువుల వాడకంతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో రంగనేతాజీ తెలిపారు. మంగళవారం మండలంలోని శెట్టివీడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న, మినుము పంటల్లో చీడ పీడలపై అవగాహన కల్పించారు. రైతులు పీఎంకిసాన్, రైతు భరోసా కోసం ఈనెల 18లోగా ఆయా రైతు సేవా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్‌ఏ ఉమామహేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని చిన్నయ్యస్వామి చెంచుగూడెం, కె.కొత్తూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఏవో సుమతి చెంచు రైతులకు, చెంచులకు వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రాజు ఉన్నారు.

ఉయ్యాలవాడ: పంట మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చని వీఏఏ శిరీష అన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మంగళవారం అల్లూరు గ్రామంలోని రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. సబ్సిడీ ఎరువులు అందించాలని రైతులు కోరారు.

యోగాంధ్రను జయప్రదం చేద్దాం

చాగలమర్రి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలో 21న నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆయా శాఖల ఉద్యోగులందరు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి గ్రామ సచివాలయంలో మాస్టర్ శిక్షకులతో యోగా శిక్షణ చేయిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

25 వరకు అభ్యంతరాల స్వీకరణ

చాగలమర్రి, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తల్లికి వందనం పథకం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని, ఈనెల 25 వరకు సచివాలయల్లో అభ్యంతరాలు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ తెలిపారు. అనర్హుల జాబితాలో ఉన్న వారు నిరుత్సాహ పడకుండా కావాల్సిన పత్రాలను సచివాలయాల్లో సమర్పించాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి తిరిగి నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించిందన్నారు.

ట్యాంక్ నిర్మాణానికి స్థల పరిశీలన

రుద్రవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరినగరం చెంచుగూడెంలో ఓవర్‌హెడ్‌ట్యాంకు నిర్మించేందుకు మంగళవారం స్థలాన్ని పరిశీలించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం తెలిపారు. 40వేల లీటర్ల సామర్థ్యంతో ట్యాంకును నిర్మించనున్నట్లు తెలిపారు. రూ.26.60లక్షల నిధులతో జల్‌జీవన్ మిషన్ కింద నిర్మిస్తున్నామని ఏఈ తెలిపారు.

విద్యాభివృద్ధికి మంత్రి నారా లోకేశ్ పెద్దపీట


విద్యా సామగ్రిని అందజేస్తున్న టీడీపీ నాయకులు

కొలిమిగుండ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని బందార్లపల్లె టీడీపీ నాయకులు యాతం కళ్యాణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రవీంద్రగుప్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, దుస్తులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు శివప్రసాద్, హైమావతి, గ్రామస్థులు సంజీవరాయుడు, వీరాంజి, శివ, హర్షవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

శిలా ఫలకం కూల్చివేత

రుద్రవరం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి.కొట్టాలు మిట్ట సమీపంలో మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి ప్రారంభించిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేసినట్లు సర్పంచ్ నరసింహారెడ్డి తెలిపారు. 2024 మార్చి 7న రూ.1.50 కోట్ల అభివృద్ధి పనులకు శిలాఫలకాన్ని అప్పటి ఎమ్మెల్యే ప్రారంభించారన్నారు. సీఐ దస్తగిరిబాబు, ఎస్‌ఐ వర ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ విషయంపై ఎస్‌ఐ వరప్రసాద్ మాట్లాడుతూ కూలగొట్టిన విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారిస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం: సీఐ


ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న సీఐ మద్దినేని రమేష్‌బాబు

కొలిమిగుండ్ల, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణ దానంతో సమానమని సీఐ మద్దినేని రమేష్‌బాబు అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల శివాలయం ఆవరణంలో బ్రీడ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరాన్ని సీఐ ప్రారంభించారు. 50మంది యువకులు రక్త దానం చేశారు. వీరికి ప్రశంశా పత్రాన్ని అందించి అభినందించారు. మరోవైపు వైద్య శిబిరంలో 120మందికి కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. మరికొందరిని శస్త్ర చికిత్సలకు రెఫర్ చేశారు. బ్రీడ్స్ యూత్ అధ్యక్షుడు రవికుమార్, రామాచారి, కుమార్, రాజేష్, రా మాంజి, నరేష్, సతీష్, ఐమిత్ర గోపాల్, పవన్, ప్రతాప్ పాల్గొన్నారు.